పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులకు చెక్
- కణితి పీహెచ్‌సీ పరిధిలో 9,300 మందికి మాత్రల పంపిణీ


దేవాడ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ ప్రదీప్ రాజా


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తున్న కణితి మెడికల్ ఆఫీసర్ స్వరూపదేవి


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న పెదగంట్యాడ వైద్య సిబ్బంది


పినమడక హైస్కూల్లో మాత్రలు అందిస్తున్న వైద్య సిబ్బంది

కూర్మన్నపాలెం: నులిపురుగుల నివారణతో విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని కణితి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వరూపదేవి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కణితి ప్రాథమిక ఆరగ్యో కేంద్రం పరిధిలో ఉన్న సుమారు 9300 మంది పిల్లలకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో 1–19 ఏళ్ల వయసు ఉన్నవారికి ఈ మాత్రలను అందజేశామన్నారు. కణితి జిల్లా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మాత్రల పంపిణీని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల శరీరాల్లోకి వివిధ మార్గాల ద్వారా పురుగులు చేరతాయన్నారు. కలుషిత ప్రాంతాల్లో చెప్పులు లేకుండా నడవడం, కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల, చేతుల శుభ్రత లేకుండా తినడం, సరిగ్గా ఉడకని మాంసం ద్వారా, పెంపుడు జంతువుల ద్వారా ఇవి శరీరంలోకి చేరతాయని తెలియజేశారు. ఫలితంగా వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల సరిగ్గా లేకపోవడం, తరచూ తీవ్రమైన కడుపునొప్పి రావడం వంటి సమస్యలకు దారి తీస్తాయన్నారు. ఈ సమస్యల నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రభుత్వం ఏటా డీ వర్మింగ్ డే ను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కణితి పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో పిల్లల్లో ఎదుగుదల లోపం

అగనంపూడి: పిల్లల్లో రక్తహీనతకు కారణమైన నులిపురుగుల నివారణకు విధిగా ఆల్బెండజోల్ మాత్రలు వినియోగించాల్సిన అవసరం ఉందని 85వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొబ్బరి అర్జునరావు అన్నారు. వార్డులోని పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చేతులు శుభ్రంగా కడుక్కోపోవడం, పరిశుభ్రమైన నీటిని తాగకపోవడం వల్ల శరీరంలో నులిపురుగులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ పురుగులు పిల్లల్లో శారీరక ఎదుగులకు ఆటంకంగా మారడంతో పాటు పిల్లల్లో చురుకుదనం లోపించి అనారోగ్యానికి గురవుతారన్నారు. ఈ మాత్రలు వాడటం వల్ల వాటిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, కొండబాబు, ఆర్.నాయుడుబాబు, వైద్య సిబ్బంది రామలక్ష్మి, దుర్గా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవాడ పీహెచ్‌సీ పరిధిలో..

పెదగంట్యాడ: దేవాడ ఎంపీపీ పాఠశాలతో పాటుగా పలు అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా దేవాడ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రాజా మాట్లాడుతూ విద్యార్థులు సంవత్సరంలో రెండు సార్లు నులిపురుగుల మాత్రలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రసాద్ రాజు, అన్నపూర్ణ, ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- రెడ్డి ముసలినాయుడు పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పెదగంట్యాడ ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో డి.బుజ్జి, భూలోక తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలాజీకి బ్రహ్మకమలాలతో అలంకరణ


స్వామికి బ్రహ్మకమలాల మాలను అలంకరించిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణం లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారికి గురువారం విశేష పూజలు చేశారు. ముందుగా నేత్రదర్శనం కల్పించారు. ఈ సందర్భంగా స్వామికి బ్రహ్మకమలాలతో అల్లిన మాలను అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ, జీఎం జి.వి. కృష్ణయ్య, దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు జి.గంగామహేష్, జీవన్ బాబు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల సర్వే


అక్కిరెడ్డిపాలెంలో ఓటర్ సర్వే చేస్తున్న బీఎల్‌వోలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ఓటరు సర్వే చురుగ్గా సాగుతోంది. గురువారం బీఎల్‌వో సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు గొంతిన వెంకటలక్ష్మి వార్డులోని పలు నివాసాల్లో ఓటరు సర్వే నిర్వహించారు. ప్రతి నివాసంలో ఉన్నవారి వివరాలతో పాటు వారి ఓటరు కార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


మృతుని కుటుంబసభ్యులకు బీమా సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: పేదలకు వైఎస్సార్ బీమా ఆపద వేళ అండగా నిలుస్తోందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. వార్డు పరిధిలోని అశోక్‌నగర్‌కు చెందిన పుట్టా రవి కుమార్ (47) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా లక్ష రూపాయలకు గాను, తక్షణ సాయంగా రూ.10వేలు మంజూరయ్యాయి. ఆ మొత్తాన్ని మృతుడి భార్య సంధ్యకు గురువారం కార్పొరేటర్ అందజేశారు. మిగిలిన సొమ్ము 90వేలు త్వరలో ఖాతాలో పడుతుందన్నారు. కార్యక్రమంలో వరహాల రాజు, అనురాధ, అనిత పాల్గొన్నారు.

సాయినాథుడికి వెండి తమలపాకుల హారం


సాయిబాబాకు హారం అలంకరిస్తున్న దాత, ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని షిర్డీసాయి బాబా ఆలయానికి అమెరికాకు చెందిన కె.పి.రావు, శారద దంపతులు, వారి కుమార్తె హారిక 108 వెండి తమలపాకుల హారం బహూకరించారు. గురువారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో హారిక ఈ హారాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కె.రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ మాట్లాడుతూ ఆలయ నిర్మాణ దశ నుంచి రావు, శారద దంపతులు సహకారం అందిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పి.రామారావు, పి.ఎల్.ఎన్.రాజు, బి.హరిబాబు, టోపీ రాజు, సత్యలక్ష్మి, సత్య శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన


ప్రభుత్వ పథకాలను తెలిపే కరపత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 86వ వార్డు దువ్వాడ సెక్టార్–2 సచివాలయ పరిధిలో గురువారం ఆయన పర్యటించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, పార్టీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి, సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా తమకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తమ అశీస్సులు ఎప్పుడూ ఉంటాయని లబ్ధిదారులు తెలపడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ పట్నాయక్, మాటూరి శ్రీనివాసరావు, యోహాన్, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆర్త జనుల సేవలో 'సత్యసాయి' సభ్యులు


మానసిక దివ్యాంగులతో సేవాదళ్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్తజన సేవ నిర్వహించారు. భెల్, కె.వి.కె.సమితి సహకారంతో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు నుంచి గంగవరం పోర్టు గేటు వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇద్దరు మానసిక దివ్యాంగులకు జుత్తు కత్తిరించి, స్నానం చేయించి, మంచి దుస్తులు వేశారు. అనంతరం వారికి అల్పాహారం అందించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ కో–ఆర్డినేటర్ ఆర్.ఎ.నాయుడు, సత్యసాయి ప్రతినిధులు ఎస్. రమేష్, విష్ణుమూర్తి, తారకేష్ గణపతి, సింహాచలం, తవిటరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని మృతి


కోమలి (ఫైల్)

అగనంపూడి: క్యాన్సర్‌తో పోరాడుతూ తోటగరువు పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినిగా చేస్తున్న విక్రమ కోమలి (55) గురువారం తుదిశ్వాస విడిచారు. మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయినిగా సేవలు అందించిన ఆమె కూర్మన్నపాలెంలో నివసిస్తున్నారు. పరవాడ మండలంలోని బోనంగి, కొత్తూరు, గంగిరెడ్ల కాలనీ తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తించి, రెండేళ్ల క్రితం పదోన్నతిపై తోటగరువు హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. ఆమె ఏడాదిగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. కోమలి మంచి చిత్రకారిణి, గాయని కూడా కావడం విశేషం. గంగిరెడ్ల కాలనీలో ఉపాధ్యాయినిగా పని చేసే కాలంలో గోడలపై అందమైన చిత్రాలను చిత్రీకరించి అధికారుల మన్ననలు పొందారు. ఆమె మృతిపై పరవాడ మండల ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి


గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: ప్రజాగాయకుడు, దళిత ఉద్యమ నేత గద్దర్‌కు నాయకులు నివాళులర్పించారు. కూర్మన్నపాలెం పరిధి సిద్ధార్థనగర్ కాలనీలో గురువారం నిర్వహించిన సంతాప సభలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. బహుజనుల రాజ్యాధికారం కోసం గద్దర్ ఎంతో కృషి చేసేవాడన్నారు. భరతమాత గొప్ప విప్లవ గాయకుడిని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, జే.ఎన్.మూర్తి, ఆర్.శంకర్ నాయక్, టి.సత్యనారాయణ, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి


మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

విశాఖ విద్య: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌వోలు శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. గురువారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో విశాఖ ఉత్తరం, గాజువాక నియోజకవర్గాలకు సంబంధించిన బీఎల్వోలతో ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమంపై సమీక్షించారు. ఓటరు జాబితా పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో క్షేత్రస్థాయిలో అనుసరిస్తున్న విధి విధానాలపై బూత్ స్థాయి అధికారుల, ఏఈఆర్‌వో, ఈఆర్‌వోలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది విధుల పట్ల తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. పొరపాట్లుకు తావులేకుండా పారదర్శకంగా అర్హులందరికీ ఓటు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం పరిధి వీఎస్ఈజెడ్ విద్యుత్ సబ్ స్టేషన్లోని 33/11 కేవీ రాజీవ్‌నగర్ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా రాజీవ్‌నగర్ రాసాలమ్మ కాలనీ, వుడా ఫేజ్ – 1,4,7, మాతృశ్రీ లేఅవుట్, దువ్వాడ స్టేషన్ రోడ్ తదితర ప్రాంతాల్లోని ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్, జేసీబీ ఆపరేటర్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి, పదో తరగతి పాసై, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94903 91324, 83338 49420 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

910వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ కార్మిక సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన నిరసన దీక్షలు గురువారానికి 910వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం విభాగ కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు పక్క దుకాణాల తొలగింపు


దుకాణాన్ని క్రేన్ సహాయంతో తొలగిస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు షీలానగర్ సర్వీసు రోడ్డును ఆనుకుని ఉన్న అనధికార దుకాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం తొలగించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి రేవతి పర్యవేక్షణలో సిబ్బంది రోడ్డుపై ఉన్న పలు దుకాణాలతో పాటు ఒక కంటైనర్‌ను క్రేన్ సహాయంతో తొలగించారు.

'స్వర్ణ జయంతి' ప్రయాణికులకు సాదర స్వాగతం



దువ్వాడలో స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: నిజాముద్దీన్–విశాఖ మధ్య నడుస్తున్న స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్‌కు గురువారం నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్లో హాల్ట్ ఇవ్వడంతో ప్రయాణికులకు ప్రజా సంఘాలు సాదర స్వాగతం పలికాయి. ఎన్నో ఏళ్ల నుంచి స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేయడంతో స్పందించిన రైల్వే బోర్డు అధికారులు గురువారం నుంచి హాల్ట్ ఇచ్చారు. బుధవారం నిజాముద్దీన్‌లో బయల్దేరిన స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ గురువారం మధ్యాహ్నం ఒంటిగంటన్నరకు దువ్వాడ చేరుకోవడంతో దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు స్వాగత బ్యానర్లతో ఎదురేగి దువ్వాడలో దిగిన ప్రయాణికులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసోసియేషన్ల ప్రతినిధులు కె.ఈశ్వర్, వి.జాషువా, వీర్రాజు, ఎం.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

580 మార్కులు వస్తే విమానం ఎక్కిస్తా

- టెన్త్ విద్యార్థులకు మింది జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఆఫర్
- పేరెంట్స్ మీటింగ్‌లో వెల్లడి


మింది హైస్కూల్లో పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న హెచ్ఎం ఆంజనేయ

అక్కిరెడ్డిపాలెం: పదో తరగతి పరీక్షల్లో 580, ఆ పై మార్కులు తెచ్చుకున్న తమ పాఠశాల విద్యార్థులను విమానం ఎక్కిస్తానని 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ తెలిపారు. వారిని సమీపంలోని ప్రాంతానికి ఫ్లైట్‌లో టూర్‌కు తీసుకువెళ్తానని చెప్పారు. మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను చదువులో అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన టాప్ 3 ర్యాంకర్లకు దాతల సహకారంతో రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు ప్రోత్సాహకం అందిస్తామని చెప్పారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలని కోరారు. ఇటీవల జరిగిన పెర్ఫార్మెన్స్–1 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను వారి తల్లిదండ్రులకు అందజేశారు. చాలామంది విద్యార్థులు చదువులో వెనకబడి ఉన్నారని, తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద పర్యవేక్షించాలని కోరారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లోను గురువారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో సత్తా


ఎం.భాస్కరరావు


రాపాక రమేష్

పెదగంట్యాడ: సమైక్య భారతీయ ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో దుబాయ్‌లో ఈ నెల 1 నుంచి 4 వరకు నిర్వహించిన అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పెదగంట్యాడకు చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తా చాటారు. స్టీల్‌ప్లాంట్ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఎం.భాస్కరరావు 55 ప్లస్ విభాగంలో షాట్‌పుట్‌లో 5 కిలోల ఇనుపగుండును 10.10మీటర్లు విసిరి రజత పతకం, డిస్కస్‌త్రో లో 23.35 దూరం విసిరి రజత పతాకం కై వసం చేసుకున్నారు. పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించారు. పెదగంట్యాడ నెల్లిముక్కుకు చెందిన మరో క్రీడాకారుడు రాపాక రమేష్ యాదవ్ పవర్‌లిఫ్టింగ్ సీనియర్ విభాగంలో 515 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి గురువారం నగరానికి వచ్చిన వారిని పలువురు అభినందించారు.

మేయర్, కమిషనర్ల దృష్టికి వార్డు సమస్యలు


మేయర్ హరి వెంకట కుమారికి వినతిపత్రం అందజేస్తున్న నర్సింహపాత్రుడు

గాజువాక: జీవీఎంసీ 65వ వార్డులో పెండింగ్ సమస్యలను ఆ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం వారిని కలిసి వినతిపత్రాలను సమర్పించారు. కొండవాలు ప్రాంతాలతో ముడిపడి ఉన్న తమ వార్డులో అపరిష్కృత సమస్యల వల్ల జనం ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రిటైనింగ్ వాల్స్, వీధి రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం, గెడ్డల ఆధునికీకరణ, భానోజీ కాలనీ స్కూల్, సామాజిక భవనం దుస్థితి, పార్కులు, వీధి దీపాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర సమస్యలను వివరించారు. తొమ్మిది పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించి వాటికి టెండర్లు పిలవాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారంపై మేయర్, కమిషనర్ సానుకూలంగా స్పందించారని నర్సింహపాత్రుడు తెలిపారు.

మాస్టర్ అథ్లెట్స్‌కు ట్రాక్ సూట్ కిట్ల పంపిణీ


సూట్ కిట్లు పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి

గాజువాక: ఈ నెల 19 నుంచి 21 వరకు శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు హాజరు కానున్న క్రీడాకారులకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ట్రాక్ సూట్ కిట్లు పంపిణీ చేశారు. కర్ణవానిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీలకు గాజువాక నుంచి ఏడుగురు క్రీడాకారులు హాజరు కానుండటం అభినందనీయమన్నారు. వారు విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశాఖ మాస్టర్ అథ్లెట్స్ సంఘం ప్రతినిధులు మంగా వరప్రసాద్, రామారావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి ఎస్సీల సమస్యలు


మంత్రి అమర్‌నాథ్‌తో ఆది ఆంధ్ర యువజన సేవా సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆది ఆంధ్రా యువజన సేవా సంఘం ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. 68వ వార్డు మిందిలోని మంత్రి నివాసంలో ఆయన్ను కలిసి, తమ సమస్యలు వివరించారు. 75వ వార్డు ఎస్సీ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ఎస్సీ కాలనీలు అభివృద్ధి చేయాలని మంత్రికి విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం గౌరవ అధ్యక్షుడు మార్టుపూడి పరదేశి, అధ్యక్షుడు కణితి వెంకట్రావు, పెద్దాడ రాములు, కణితి శివ తదితరులున్నారు.

పూలే పార్కు ఏర్పాటుకు వినతి


సీఎండీ అతుల్ భట్‌కు బొకే అందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో జ్యోతిరావు పూలే పేరిట పార్కు ఏర్పాటు చేయాలని స్టీల్ ఓబీసీ సంఘం నాయకులు సీఎండీ అతుల్ భట్‌ను కోరారు. ఓబీసీ లైజన్ ఆఫీసర్ గంటా అప్పారావుతో కలిసి, గురువారం సీఎండీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నెల 29న స్టీల్‌క్లబ్‌లో నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.అప్పారావు, కోయిలాడ శ్రీనివాస్, నారాయణ, గోవిందు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులపై హర్షం

అగనంపూడి: గ్రామస్థాయిలో సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సాహసోపేతమైన నిర్ణయమని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు అన్నారు. కొండయ్యవలసలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు గ్రామస్థాయిలో సమాచార హక్కు చట్టం అమలుకు ఉన్నతాధికారి కార్యాలయం నుంచి మాత్రమే సమాచారం అందేదన్నారు. ఇప్పుడు వార్డు సచివాలయ స్థాయిలో పౌర సమాచార అధికారిని నియమించడానికి ఉత్తర్వులు జారీ చేయడం వల్ల గ్రామ, వార్డు స్థాయిలో పారదర్శక పాలనకు అవకాశం ఉంటుందన్నారు. ఇది హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నీలాపు మహేష్, దానబాల త్రిమూర్తులు పాల్గొన్నారు.

ముఠా కార్మికుల ధర్నా

గాజువాక: వివిధ రిటైల్, హోల్‌సేల్ షాపులు, గొడౌన్లలో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తున్న తమకు సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ముఠా కార్మికులు గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఎటువంటి సౌకర్యాలు, హక్కులు లేకుండా కార్మికులు పని చేస్తున్నారన్నారని ముఠా వర్కర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎం.రాంబాబు, లోకేష్, రమణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు



అక్కిరెడ్డిపాలెం: భెల్ టౌన్‌షిప్ ఈ–73లో నివాసముంటున్న బి.కొండలరావు అనే కార్మికుని ఇంట బ్రహ్మకమలాలు వికసించాయి. నాలుగు మొక్కల నుంచి 6 బ్రహ్మకమలాలు వికసించి ఆకర్షణీయంగా కనిపించడంతో క్వార్టర్స్‌లో నివసిస్తున్న వారు ఆసక్తిగా వీక్షించారు.